క్లుప్తంగా

పనులు పరిశీలన

లోకేశ్వరం: మండలంలోని పంచగుడి, ధర్మోర, వట్టోలి, బిలోలి గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులను సోమవారం సామాజిక తనిఖీ బృందం సభ్యులు పరిశీలించారు. సీసీరోడ్లు, చెరువు పూడికతీత పనులు, సెగ్రిగేషన్ షెడ్లు, క్రీడా ప్రాంగణాలు, పల్లె ప్రకృతి వనంలోని మొక్కలను పరిశీలించి లెక్కించారు. పూర్తి వివరాలను ప్రజావేదికలో వెల్లడిస్తామని వారు పేర్కొన్నారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, టీఏలు, సభ్యులు ఉన్నారు.

ఐకేరెడ్డిని కలిసిన చైర్మన్

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నిర్మల్ పట్టణ అభివృద్ధిపై పలు అంశాలు చర్చించారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎం ప్రతిమారెడ్డి

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని సోమవారం నిర్మల్ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం బస్టాండ్‌లోని వ్యాపార సముదాయాలు, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో సంతోశ్, గిరి తదితరులున్నారు.

అమరవీరులకు నివాళి

పెంబి: మండల కేంద్రంలో అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఫారెస్ట్ అధికారులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అటవీశాఖ ఉద్యోగుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఆర్వో ప్రతాప్‌నాయక్, ఎఫ్ఎస్‌వోలు శ్రీనివాస్, రవి, ఎఫ్‌బీవోలు ఉన్నారు.

రేపటి ధర్నాకు తరలిరావాలి

భైంసాటౌన్: బీడీ కార్మికులందరికీ ఆంక్షలు లేని జీవనభృతి అందించాలనే డిమాండ్‌తో ఈనెల 13న భైంసా ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎం.బక్కన్న పిలుపునిచ్చారు. సోమవారం భైంసాలో జరిగిన యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజన్న, ఆర్.రామలక్ష్మణ్, ఎస్.గంగన్న, ఎండీ గఫూర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దోమతెరలు పంపిణీ

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్‌లో యాభై మంది గ్రామస్తులకు సర్పంచ్ బొడ్డు గంగన్న దోమతెరలు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ గోపాల్, కార్యదర్శి రమాదేవి, కారోబార్ మహేందర్ తదితరులు ఉన్నారు.

నియామకం

నిర్మల్‌టౌన్: ఆమ్ ఆద్మీ పార్టీ సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్‌గా మహమ్మద్ ముసేబ్‌ను నియమించారు. సోమవారం నిర్మల్‌లో ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ కన్వీనర్ సయ్యద్ హైదర్ అతడికి నియామక పత్రం అందించారు. కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

దాతలకు సన్మానం

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో శ్రీ వీర హనుమాన్, ఎల్లమ్మ, పెద్దమ్మ ఆలయాలను నూతనంగా నిర్మించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన కోసం దాతలు శ్రీనివాస్‌గౌడ్, సదాశివ్ పటేల్, శరత్‌గౌడ్, గందే శివకుమార్, ఎగ్గం నరసింహులు, చంద్రయ్య రూ.11వేలు, బొంతల మారుతి కంబోలి లక్ష్మణ్, వడ్ల లింగం రూ.5,100 చొప్పున విరాళం అందజేశారు. వీరిని సోమవారం స్థానిక శివాలయం ఆవరణలో సన్మానించి అభినందించారు.

ఘనంగా తీజ్ వేడుకలు



వేడుకలో పాల్గొన్న జాన్సన్ నాయక్

దస్తురాబాద్: మండలంలోని ఎర్రగుంట గ్రామంలో సోమవారం తీజ్ వేడుకలు నిర్వహించగా ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ పాల్గొన్నారు. ఎంపీపీ కిషన్, సర్పంచ్ బిల్‌సింగ్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఐలయ్యయాదవ్, రాజనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తే ఫిర్యాదు చేయండి

నిర్మల్‌టౌన్: ఆకతాయిలు వేధిస్తే భయపడకుండా ధైర్యంగా డయల్ 100కు ఫిర్యాదు చేయాలని షీటీం ఎస్సై సుమాంజలి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విన్నర్స్ పాఠశాలలోని విద్యార్థులకు షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇబ్బందులు ఎదురైతే షీ టీం ఎమర్జెన్సీ నెంబర్ 87126 59550కు ఫోన్ చేయాలనీ సూచించారు. ఉపాధ్యాయులు, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్లతో కష్టాలు



భారీ వర్షాలకు కోతకు గురైన వాడవన వంతెన

- భారీ వర్షాలకు కోతకు గురైన రహదారులు, కల్వర్టులు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

తానూరు: భారీ వర్షాలకు మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్లు కోతకు గురవడంతోపాటు పలు చోట్ల కల్వర్టులు దెబ్బతిన్నాయి. దీంతో ఆయా మార్గాల్లో వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

దెబ్బతిన్న రోడ్లు ఇవీ..

మండలంలోని ఎల్వత్ గ్రామం నుంచి వాడవన వెళ్లే మార్గంలో ఉన్న వంతెన వద్ద రోడ్డు కోతకు గురైంది.



ఉమ్రి(కే) సమీపంలో ఇరువైపులా దెబ్బతిన్న కల్వర్టు

దాగాం గ్రామం నుంచి హంగిర్గా వెళ్లే మార్గంలో రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది.

ఉమ్రి(కే)ఎక్స్‌రోడ్డు నుంచి ఉమ్రి(కే) వెళ్లే మార్గంలో వంతెన వద్ద, ఇలేగాం ఉమ్రి(కే) శివారులోని వంతెన వద్ద రోడ్లు ప్రమాదకరంగా మారాయి.

మరమ్మతులు చేపట్టాలి



ఉమ్రి(కే) వంతెన సమీపంలో కల్వర్టు వద్ద ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. దీంతో వచ్చి పోయేటప్పుడు భయాందోళన చెందుతున్నాం. కొందరు గుంత తెలియక రాత్రి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

– గంగాధర్ పటేల్, ఉమ్రి(కే)

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం

కోతకు గురైన రోడ్లకు మరమ్మతులు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఉమ్రి(కే), దాగాం, వాడవన గ్రామాల రోడ్లకు వంతెనల సమీపంలో ఏర్పడిన గుంతలను పరిశీలించాం. నిధులు విడదలవగానే మరమ్మతులు చేయించి.. ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం.

– జాదవ్ చందు, పీఆర్ డీఈ

అధికారుల పర్యవేక్షణ కరువు..

మరోవైపు వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పరిశీలించి మరమ్మతులు చేయించాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లేదు. ఇతర గ్రామాల నుంచి వచ్చే ప్రయాణికులు గుంతలు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్ల సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

సమ్మెబాట పట్టిన అంగన్‌వాడీలు

దిలావర్‌పూర్: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగులు సోమవారం నుంచి సమ్మెబాట పట్టారు. దిలావర్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ పాల్గొని మాట్లాడారు. నెలరోజుల కిందటే లేబర్‌యాక్టు ప్రకారం ఐసీడీఎస్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టి పంచాయతీ కార్యదర్శులకు, ఐకేపీ సిబ్బందికి అప్పజెప్పడం ఏంటని ప్రశ్నించారు. అంగన్‌వాడీ జిల్లా యూనియన్ అధ్యక్షురాలు రా జ మణి, జిల్లా కార్యదర్శి లలిత, విజయ, హేమలత, విజయలక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె శిబిరం ఏర్పాటు చేశారు. వెంకటలక్ష్మి, భాగ్యలక్ష్మి, గంగామణి, లలిత, సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సోన్: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలోకి వెళ్లారు. పంచాయతీ కార్యదర్శులు, నాయకులు అంగన్‌వాడీ



దిలావర్‌పూర్‌లో మద్దతు తెలుపుతున్న సురేశ్

కేంద్రాల తాళాలు పగులగొట్టి నడిపించారు.

వీవోఏలకు తాత్కాలిక బాధ్యతలు

నర్సాపూర్(జి): తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె చేపట్టారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీదేవి, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టారు. అనంతరం వాటి నిర్వహణ బాధ్యతలను వీవోఏలకు అప్పగించారు.

కుంటాల: మండల కేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్ మద్దతు తెలిపి మాట్లాడారు. జిల్లా అధ్యక్షురాలు



లక్ష్మణచాందలో పాల్గొన్న అంగన్‌వాడీ సిబ్బంది



సోన్: న్యూవెల్మల్‌లో తాళం పగులగొడుతున్న సిబ్బంది

రాజమణి, లలిత, జిల్లా కార్యదర్శి విజయ, విమల, రాజమణి, ఫర్జానా, గంగాజ్యోతి, గుణసుందరి, స్వరూపరాణి, సునీత పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూరు: ప్రత్యేక రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బామ్ని గ్రామంలో నూతనంగా నిర్మించిన మహాదేవ్ ఆలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వైస్‌ఎంపీపీ చంద్రకాంత్, మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోతారెడ్డి, కృష్ణ, భీమ్ పవార్, మాజీ సర్పంచ్ గంగాధర్ పాల్గొన్నారు.

భైంసారూరల్: దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. సోమవారం భైంసా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, జీఓ 58 ప్రకారం క్రమబద్ధీకరించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా 32మందికి కల్యాణలక్ష్మి, 129 మందికి షాదీముబారక్, 460 మందికి ఇంటిస్థలాల పట్టాలను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఫారూక్ అహ్మద్, ఆసిఫ్, తోట రాము, ఫయాజుల్లాఖాన్, అమీర్, గౌతం పింగ్లే తదితరులు పాల్గొన్నారు.



తానూరు: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి పంచాయతీలోని పాతడొంగుర్గాం శ్రీ సిద్ధేశ్వరాలయంలో భక్తులకు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నదానం చేశారు. ఈసందర్భంగా గ్రామపెద్దలు అర్లి(కె) ఎక్స్‌రోడ్డు నుంచి ఆలయానికి, ఆలయం నుండి తురాటి బస్టాండ్ వరకు బీటీ రోడ్డు, ఆలయం చుట్టూ ప్రహరీ, సీసీ పనులు, అర్చకుడు ఉండేందుకు గది, మూత్రశాలలు నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్, అర్లి ఎత్తిపోతల పథకం చైర్మన్ చంద్యాల మురళి, పిప్పెర కృష్ణ, కొంద్ర రమేశ్, గోపిడి గంగారెడ్డి, రమణగౌడ్, మక్బుల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

తానూరు: శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో మండలంలోని బోరిగాం గ్రామ సమీపంలోని మహాదేవుడి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సమీప గ్రామాలతో పాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్ రెడ్డి పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు చంద్రకాంత్ యాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అష్టోత్తర రుద్రాభిషేకం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నగరేశ్వరవాడ శివాలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం 108 జంటలతో అష్టోత్తర రుద్రాభిషేక మహోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా వేద మంత్రోచ్ఛరణల నడుమ శివ,పార్వతుల విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు బద్రి శ్రీనివాస్, కనపర్తి విగ్నేశ్, ముక్క రాజు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలంలోని సుంక్లి గ్రామ నాగదేవత ఆలయంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. సిరాల శివాలయంలో సప్తాహం నిర్వహించారు. ఇలేగాం, చుచుంద్, వానల్‌పాడ్, వాలేగాం ఆలయాలకు భక్తులు తరలివచ్చారు.

కుంటాల: మండలంలోని ఓలా శివాలయం, సూర్యాపూర్ రాజరాజేశ్వరాలయం, కుంటాల మహాదేవుని ఉమామహేశ్వర ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శివలింగాలకు అభిషేకం అందంగా అలంకరించారు. సూర్యాపూర్ రాజరాజేశ్వర ఆలయంలో ఆలయకమిటీ చైర్మన్ రొడ్డ రవి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



లోకేశ్వరం శివాలయంలో భక్తుల పూజలు

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన

లక్ష్మణచాంద: మండలంలోని తిర్పెల్లి గ్రామంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ కొరిపెల్లి క్రిష్టారెడ్డి, కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్ రెడ్డి, అడ్వాల రమేశ్, జెడ్పీటీసీ రాజేశ్వర్, నాయకులు కేశం రమేశ్, జహీర్ పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండల కేంద్రంలోని శివాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీ పశుపతినాథ్ ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన తాటివార్ గోపికృష్ణ–శిల్ప దంపతులు పూజారి ప్రణీత్ మహరాజ్ ఆధ్వర్యంలో శివలింగానికి బిల్వర్చన చేసి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

కుంటాల: మండలంలోని లింబా(కె)లో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభం ఏర్పాటుకు జనగామ కలెక్టర్ శివలింగయ్య రూ.4.50లక్షలను విరాళంగా ఇచ్చారు. సోమవారం ఆలయం ఎదుట ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మోరే ఆనందరావు పటేల్, అశోక్ రెడ్డి, ఎంపీటీసీ సునంద, ఉప సర్పంచ్ ముత్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



ప్రవచనాలు చెబుతున్న దుర్గాప్రసాద్ స్వామి

కుంటాల: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవర్చుకుంటే మానవజన్మ సార్థకమవుతుందని విజయవాడ శ్రీ హనుమాన్ దీక్ష పీఠం పీఠాధిపతులు సాయి దుర్గాప్రసాద్ స్వామి అ న్నారు. మండల కేంద్రంలో సోమవారం శ్రీఉమామహేశ్వర ఆలయంలో భక్తులకు ప్రవచనాలు బోధించారు. సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. గురుస్వాములు భుజంగం గణపతి, కడార్ల హరిప్రసాద్, అర్చకులు వినయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గోశాలకు రూ.1,11,600 విరాళం

భైంసాటౌన్: పట్టణంలోని వివేకానంద ఆవాసంలో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోస్లే మోహన్‌రావు పటేల్ తన పుట్టినరోజు వేడుకలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆవాసం ప్రముఖ్‌ను అడిగి పిల్లల బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం పిల్లలతో కలిసి అక్కడే భోజనం చేశారు. ఆవాసం నిర్వహణ కోసం కొంత నగదు విరాళం అందజేశారు. అంతకుముందు స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వా మి ఆలయంలో పూజలు చేశారు. గోశాలలో షెడ్డు నిర్మాణం కోసం గోశాల కమిటీకి రూ.1,11,600 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్, పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచులు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.



పిల్లలతో భోజనం చేస్తున్న మోహన్‌రావు పటేల్

'హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి'

నిర్మల్‌చైన్‌గేట్: సనాతన ధర్మంపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన ఉదయ్‌నిధి హిందూ సమాజానికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోరారు. పార్టీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఎస్పీ క్యాంప్ కార్యాలయం నుంచి నగరేశ్వర్‌వాడ శివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, సాధం అరవింద్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక..

లక్ష్మణచాంద మండలం పార్‌పెల్లి గ్రామంలోని యువకులు పలువురు బీజేపీలో చేరారు. సోమవారం మహేశ్వర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరగా.. ఆయన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సామ రాజేశ్వర్ రెడ్డి, అర్జున్, భూపతిరెడ్డి, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల భిక్షాటన

నిర్మల్‌రూరల్: తమను రెగ్యులరైజ్ చేయాలని సమ్మె చేస్తున్న విద్యాశాఖ సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగులు సోమవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 14 రోజులుగా జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్నారు. సోమవారం దీక్ష శిబిరం నుంచి ర్యాలీగా బయలుదేరి వివిధ కూడళ్ల వద్ద, దుకాణాల్లో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. పక్షం రోజులుగా తాము శాంతియుతంగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటనే తమపై దయ చూపి రెగ్యులర్ చేయాలని కోరారు.



భిక్షాటన చేస్తున్న ఉద్యోగులు

నేడు కాంగ్రెస్ నియోజకవర్గస్థాయి సమావేశాలు

ఖానాపూర్: పట్టణంలోని జేకే ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం కాంగ్రెస్ ఖానాపూర్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్ తెలిపారు. సోమవారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుతోపాటు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిశీలకులు ప్రకాష్ రాథోడ్ హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి ఎమ్మెల్యే టికెట్ ఆశావహులతోపాటు మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరవాలని కోరారు.

భైంసాలో..

భైంసాటౌన్: కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల జిల్లా పరిశీలకులు ప్రకాష్ రాథోడ్ మంగళవారం భైంసాకు రానున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సింధే ఆనంద్‌రావు పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమల జిన్నింగ్ ఫ్యాక్టరీ ఎదుట శ్రీ ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ జనరల్ బాడీ, యువజన కాంగ్రెస్, కిసాన్ సెల్ సేవాదళ్, ఎన్ఎస్‌యూఐ నాయకులతో సమావేశం నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఓటరుగా నమోదు చేసుకోవాలి

పెంబి: 18 ఏళ్లు నిండి ఓటు హక్కు లేనివారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఓటరు నమోదుపై ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని.. అందులో పేర్లు లేని అర్హులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వైస్ ఎంపీపీ గంగారెడ్డి, ఆర్ఐ రాజం, ఉపసర్పంచ్ స్వప్నీల్ తదితరులున్నారు.

పశుపోషణపై దృష్టి సారించాలి

సోన్: రైతులు వ్యవసాయంతోపాటు కోళ్లు, గొర్రెలు, ఆవులు వంటి పశుపోషణపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి వినోద్ అన్నారు. సోమవారం మండలంలోని పాక్‌పట్ల గ్రామంలో సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. ఎకరంలో వరితోపాటు చిరుధాన్యాలను సాగు చేసుకోవాలన్నారు. అర ఎకరంలో పండ్ల తోటలు సాగు చేస్తూ.. అంతర పంటలుగా కూరగాయలను పండిస్తే సంవత్సరం పొడవునా ఆదాయం వస్తుందని సూచించారు. వారి వెంట ఏఈవోలు అంబాజీ, అశోక్, రైతులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పర్యటన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం మంత్రి ఐకేరెడ్డి ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని వైద్యాధికారి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

ఖానాపూర్: పట్టణంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ క్యాంపు కార్యాలయంలో ఉట్నూర్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఉట్నూర్ మండలంలోని లక్కారం, మత్తడిగూడ గ్రామాలకు చెందిన యువకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ప్రిన్సిపాల్‌కు సత్కారం

కడెం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు ఇటీవల మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకున్నారు. సోమవారం హపవత్ రాజేందర్, ముక్కెర గంగాధర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సిద్ధార్థనాయక్, రాజేశ్వర్ రెడ్డి, అధ్యాపకులు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు

కడెం: మండల కేంద్రానికి చెందిన ఓర్సు సాయిప్రసాద్ జగిత్యాల వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. కడెంకు చెందిన ఓర్సు బాలమణి–నగేశ్ దంపతుల కుమారుడు సాయిప్రసాద్ పదో తరగతి వరకు కడెం జెడ్పీపీఎస్, ఇంటర్ హైదరాబాద్‌లో పూర్తి చేసినట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

గురువులే సమాజ నిర్మాతలు

సారంగాపూర్: మన అజ్ఞానం తొలగించి.. విజ్ఞానాన్ని ప్రసాదించే గురువులే సమాజ నిర్మాతలని ఎంపీపీ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఎంఈవో మధుసూదన్, అడెల్లి ఆలయ రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, మాణిక్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గొర్రె మృతి

లక్ష్మణచాంద: విద్యుత్ షాక్‌తో గొర్రె మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామంలో చోటు చేసుకుంది గ్రామానికి చెందిన భూషణం ప్రభాకర్ గొర్రె సోమవారం ఉదయం చేనులో మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం తనను ఆదుకోవాలని ప్రభాకర్ వేడుకున్నాడు.

సన్మానం

భైంసాటౌన్: భైంసా కోర్టులో హోంగార్డుగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన మల్లారెడ్డిని కోర్టు సిబ్బంది, లాయర్లు సోమవారం ఘనంగా సన్మానించారు. శాలువా, పుష్పగుచ్ఛం అందించి వీడ్కోలు తెలిపారు. న్యాయవాదులు గడపాలే, అశోక్‌చంద్రే, సుమిత్‌సింగ్, సిబ్బంది చంద్రకాంత్ ఉన్నారు.

భూమిపూజ

నిర్మల్‌రూరల్: మండలంలోని నీలాయిపేట్ గ్రామంలో సోమవారం ఎస్టీ సంఘ భవనం, కల్వర్టు నిర్మాణ పనులకు ఎంపీ పీ రామేశ్వర్‌రెడ్డి భూ మి పూజ చేశారు. ఆయా నిర్మాణాలకు రూ.ఐదు లక్షల చొప్పున మంజూరైనట్లు పేర్కొన్నారు. డీసీసీబీ చైర్మన్ రామ్‌కిషన్ రెడ్డి, రాజారెడ్డి, ఎంపీటీసీ విలాస్, సర్పంచ్ సాయన్న పాల్గొన్నారు.